క్లుప్తంగా

నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలు



విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న హెచ్ఎం లక్ష్మీ

చిత్తూరు కలెక్టరేట్: నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలు అని వరదప్పనాయుడు నగరపాలక ఉన్నత పాఠశాల హెచ్ఎం లక్ష్మీ అన్నారు. ఆ పాఠశాలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చంద్రయాన్ 3 విజయవంతాన్ని గుర్తు చేసుకునేందుకు ప్రతి ఏటా ఆగస్టు 23న అంతరిక్ష దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఆ పాఠశాల విద్యార్థులు పలు ప్రయోగాలను ప్రదర్శించారు. ఉత్తమ ప్రయోగాలు ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సైన్స్ టీచర్లు ప్రభావతి, భువనేశ్వరి, కోటేశ్వరి, గిరికుమారి తదితరులు పాల్గొన్నారు.

తెలుగుభాషపై మహాసభ రేపు

కాణిపాకం: తెలుగుభాష పరిరక్షణ క్రమంలో భాగంగా తెలుగు రచయితల జాతీయ మహాసభను భారతీయ తెలుగు రచయితల సమాఖ్య మరియు ఎం.వి.కేశవ రెడ్డి స్మారక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చిత్తూరులో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఎం.వి.శ్రీధర్ రెడ్డి, మత్రిపూడి దేవేంద్రరావు, సి.నారాయణ స్వామి తెలిపారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఉదయం 8.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు జాతీయ స్థాయి శతాధిక తెలుగు కవి సమ్మేళనంతోపాటు రచయితల మహాసభను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న 250 మంది సాహితీ వేత్తలు, తెలుగు భాషాభిమానులకు పురస్కారాల ప్రదానం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాలకు తెలుగు భాషాభిమానులు హాజరు కావాలని వారు కోరారు.

కాలభైరవ అష్టమి యజ్ఞ కరపత్ర ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ట్రస్టు నిర్వాహకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మండలంలో ఈనెల 25న జరిగే శ్రీమహా కాలభైరవ అష్టమి యజ్ఞ మహోత్సవంలో భక్తులు విరివిరిగా పాల్గొని జయప్రదం చేయాలని ట్రస్టు చైర్మన్ వెంకటేష్ పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని శ్రీఅగస్తీశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం యజ్ఞ మహోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈశ్వరగుడివీధిలోని శ్రీఅగస్తీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం యజ్ఞపూజలు ఉంటాయని చెప్పారు. ఉదయం అభిషేకం, గోపూజ, అశ్వపూజ, శునకపూజ, రెండవకాలపూజ, యజ్ఞం, శునక పూజలు, రెండవ కాలపూజ, సాయంత్రం 64 ద్రవ్యాలతో మహాభిషేకం, 81 కలశాలతో అభిషేకం, మహాహారతి తదితర పూజలు శాస్త్రోక్తంగా ఉంటాయన్నారు.

మొగిలి ఘాట్ పరిశీలన



రహదారిని పరిశీలిస్తున్న తహసీల్దార్

బంగారుపాళెం: మండలంలో ప్రమాదాలకు నిలయంగా మారిన మొగిలి ఘాట్ రోడ్డును శుక్రవారం తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మొగిలి ఘాట్‌లోని చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో పలువురు మృత్యువాత పడుతున్నారని మరి కొందరు గాయాలపాలవుతున్నారని తెలిపారు. కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు మొగిలి ఘాట్‌లో ప్రమాదాలను నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను క్షేత్రస్థాయిలో ప్రజలను అడిగి తెలుసుకుని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ లావణ్య, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

వీఆర్వోను సస్పెండ్ చేయండి

పలమనేరు: దళితుల భూములను అగ్రవర్ణాలకు అక్రమంగా కట్టబెట్టిన పెంగరగుంట వీఆర్వో గోవిందును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద మానవహక్కులు, అవినీతి నిర్మూలన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ధర్నా చేశారు. జిల్లా నాయకులు డీవీ మునిరత్నం మాట్లాడుతూ, జంగాలపల్లెకు చెందిన సర్వే నంబర్ 439/1లో 1.88 ఎకరాలకు సంబంధించి నిమ్నజాతి పట్టాను అదే గ్రామంలోని అగ్రకులాలకు చెందిన చక్రపాణి, నీలమ్మలకు ఆన్‌లైన్‌లో నమోదు చేసి పట్టాలు మార్చారని ఆరోపించారు. దీనిపై వీఆర్వో గోవిందు వివరణ కోరగా..తానేమీ అక్రమాలకు పాల్పడలేదని, ఈ ప్రక్రియ మొత్తం నిబంధనల మేరకు చేశామని, పట్టాదారులు ఈ భూమిని గతంలో విక్రయించి ఇప్పుడు ఉద్దేశపూర్వకంగా రాజకీయం చేస్తున్నారని తెలిపారు.

నిరంతరం పోలీసు గస్తీ



రాత్రి వేళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవలు అందిస్తున్న డాక్టర్లకు రక్షణగా అవసరమైన చర్యలు చేపట్టాలి. అక్కడ నైట్ వాచ్‌మన్‌లను వెంటనే నియమించాలి. ఆ ప్రాంతంలో నిరంతరం పోలీసు గస్తీ ఉండేలా చూడాలి. సాధ్యమైనన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని నిత్యం పర్యవేక్షించాలి. అవసరమైనప్పుడు వెంటనే స్పందించే ఏర్పాట్లు చేయాలి. జిల్లా, ఏరియా, సీహెచ్‌సీల్లో సదుపాయాలు పూర్తి స్థాయిలో ఉండేలా చూడాలి.

- ఆరాధ్య కీర్తన, జూనియర్ డాక్టర్, జిల్లా ఆస్పత్రి, చిత్తూరు

రక్షణ కల్పించండి



కరోనా విజృంభించిన విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను సైతం పణంగా పెట్టి మరీ డాక్టర్లంతా సేవలు అందించాం. సాధారణ సమయాల్లోనూ పని ఒత్తిడి ఎక్కువైనా చిరునవ్వుతోనే వైద్యం అందిస్తున్నారు. కానీ, కొందరు వ్యవహరిస్తున్న తీరు తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. మద్యం, గంజాయి వంటివి తాగి వచ్చేవారితో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వైద్యం అందించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజా సేవే మా ధ్యేయంగా పనిచేస్తున్నాం..రక్షణ కల్పించండి.

-వినీలా, జూనియర్ డాక్టర్, జిల్లా ఆస్పత్రి, చిత్తూరు

పర్యావరణ హితం..
మట్టి విగ్రహం



గుడిపాలలో తయారవుతున్న మట్టి విగ్రహాలు

గణపయ్యతత్వం పృథ్విమయమని, అందుకే పృథ్విలో దొరికే మట్టితో చేసే గణపయ్యనే పూజించాలని వేద పండితులు ఘోషిస్తున్నారు. ప్రతిసారి వినాయక చవితి ముందు నెల రోజుల నుంచి ఈ మట్టి ప్రచారం ఊపందుకుంటుంది. మట్టి విగ్రహాలనే పూజించాలంటూ పర్యావరణ వేత్తలు చైతన్యం కల్పిస్తున్నారు. అయినా చవితి రోజు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు మండపాల్లో ప్రత్యక్షమవుతుంటాయి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు పూర్తిగా కనుమరుగయ్యే వరకు మట్టి గణపయ్యను పూజించేలా అవగాహన కల్పించేందుకు ఈ కథనం.

- గణపయ్యతత్వం.. పృథ్విమయం!
- మట్టి గణపయ్యను పూజిద్దాం
- జల వనరులను కాపాడుకుందాం

గుడిపాల: వినాయకచవితి రోజున మట్టి వినాయకుడిని మాత్రమే వినియోగించాలి. పూర్వకాలం నుంచి కూడా మట్టిగణపతినే పూజించేవారు. అయితే కాలానుగుణంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు వాడుకలోకి వచ్చాయి. ఇవి పూజకు నిషిద్ధమని ఇటు పండితులు, అటు పర్యావరణవేత్తలు చెబుతున్నారు. స్వచ్ఛమైన మట్టితో తయారుచేసిన వినాయకుడి ప్రతిమనే పూజకు ఉపయోగించాలని స్పష్టం చేస్తున్నారు. మట్టి వినాయకుడినే ఎందుకు పూజించాలంటే.. వినాయకుడి తత్వం పృథ్విమయం అని పురాణాల్లో ఉంది. పృథ్వి అంటే భూమి. భూమిలో లభించే మట్టితోనే ఆయన ప్రతిమను తయారుచేసి పూజించాలని పండితులు పేర్కొంటున్నారు. మట్టితో తయారుచేసిన విగ్రహం ఎక్కువకాలం ఉండదు కాబట్టే నిమజ్జనం చేయాలని చెప్పారు. గతంలోనూ మట్టి ప్రతిమలతోనే గణనాథులు పూజలందుకున్నారు. అందుకే మనం మట్టివినాయకుడిని పెట్టి పూజించాలి.

మట్టితో లాభాలు

- సహజసిద్ధంగా దొరికే బంకమట్టితో విగ్రహాలు తయారుచేసుకోవడం మంచిది. ఇది నీటిలో సులభంగా కరిగిపోతుంది.
- మట్టివిగ్రహాల నిమజ్జనంతో జల వనరులకు ఎలాంటి నష్టం ఉండదు.
- సహజసిద్ధమైన చెట్ల ఆకులు, బెరడుతో తయారు చేసే రంగులను మట్టిబొమ్మలకు అద్ది ఆకర్షణీయంగా తయారుచేసుకోవచ్చు.

రసాయనాలతో అనర్థాలు

- ప్లాస్టర్‌ఆఫ్ పారిస్‌తో తయారుచేసే విగ్రహాలు కుంటలు, చెరువుల్లో నిమజ్జనం చేసినా కరగవు. ఈ విగ్రహాల్లో జిప్సమ్, గంధకం, మెగ్నీషియమ్, పాదరసం, సీసం, కాడ్మియం, ఆర్గానిక్స్, కార్బన్ అవశేషాలుంటాయి.
- ఈ ప్రతిమలకు పూసిన రంగులు నీటిని కలుషితం చేస్తాయి. ఈ నీటిని తాగిన పశువులకు జీర్ణకోశ వ్యవస్థ దెబ్బతింటుంది.
- రసాయనాలు కలిసిన నీటి మూలంగా శరీరంలో నరాలపై ప్రభావం చూపి కేన్సర్‌వ్యాధికి దారితీస్తుంది. చర్మవ్యాధులు వ్యాప్తి చెందుతాయి.
- రసాయనిక రంగులు కలిసిన నీరు పంటపొలాల్లో చేరి దిగుబడులు తగ్గించడమే కాకుండా ఆహార ఉత్పత్తులను కలుషితం చేస్తుంది.
- ప్లాస్టర్ పారిస్ నీటిలో కరగడానికి కొన్నేళ్లు పడుతుంది. నీరు, నేల, గాలి అన్నింటిపైనా కాలుష్య ప్రభావం ఉంటుంది.

మట్టి వినాయకుడినే పూజిద్దాం



రసాయనాలతో తయారుచేసే ప్రతిమలను కాకుండా మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందాం. మా గ్రామంలో అధికంగా కుమ్మరులు ఉండడంతో మాగ్రామంలో అందరికీ మట్టి వినాయకున్నే అందజేస్తారు. 150 కుటుంబాల వారు మట్టి వినాయకుడినే పూజించి పర్యావరణాన్ని కాపాడుకుంటాం.

-ఏకాంబరంరెడ్డి, వసంతాపురం

పీఓపీ విగ్రహాలే వాడుతున్నారు



ఇప్పటికే చాలా గ్రామాల్లో రసాయనాలతో తయారుచేసే విగ్రహాలనే వాడుతున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో అధికారులు అవగాహన కల్పించకపోవడంతోనే ఇలా జరుగుతుంది. గ్రామాల్లో తెలియజేసినట్లయితే రసాయన విగ్రహాలను వాడకుండా మట్టి విగ్రహాలను చాలామంది వాడుకుంటారు. అవగాహన కార్యక్రమాలను అధికారులు నిర్వహించాలి.

- మల్లికార్జున్, సీఆర్‌పీ, గుడిపాల

మట్టి విగ్రహాలే శ్రేష్టం



మట్టి విగ్రహాలే పూజకు శ్రేష్టం. రసాయనాలతో తయారుచేసే పీవోపీ విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేస్తే ఆ నీరు కలుషితమవుతుంది. ఆ నీటిని పశువులు తాగితే వ్యాధుల బారిన పడతాయి. అటువంటి విగ్రహాలను పక్కన పెట్టి మట్టి విగ్రహాలను వాడడం వలన మానవాళికి కూడా ముప్పువాటిల్లకుండా ఉంటుంది. ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే వాడుకోవడం మంచిది.

- రెడ్డెప్ప, మాజీ సర్పంచ్, వసంతాపురం



పీవోపీ విగ్రహాలు

ప్రకాశం పంతులును ఆదర్శంగా తీసుకోవాలి

బంగారుపాళెం: స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సీఎం టంగుటూరు ప్రకాశం పంతులును విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వందనా త్రిపాఠి అన్నారు. స్థానిక పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అధ్యాపకులు టంగుటూరి ప్రకాశం పంతులు సేవలను తెలిపారు.

ఫాగింగ్ చేయండి



తనిఖీలో డీఎంహెచ్ఓ ప్రభావతి దేవి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ఎప్పటికప్పుడు ఫాగింగ్ చేయాలని డీఎంహెచ్ఓ ప్రభావతి దేవి ఆదేశించారు. చిత్తూరు నగరంలోని సత్యనారాయణపురం, వెంగళ్రావ్ కాలనీల్లో చేపట్టిన ఫ్రైడే–డ్రై డే కార్యక్రమాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా ప్రాంతాల్లో నీటి నిల్వలను పరిశీలించారు. దోమలకు ఆవాసంగా ఉన్న ప్రాంతాలను గుర్తించారు. వెంటనే వాటి తొలగించేలా చర్యలు చేపట్టారు. అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, దోమల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది ఉన్నారు.

హెచ్ఐవీపై అవగాహన తప్పనిసరి



తగ్గువారిపల్లె ఇందిరమ్మకాలనీలో హెచ్ఐవీపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

బంగారుపాళెం: ప్రజలు హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని ఐసీటీఎస్ కౌన్సిలర్ బాబు అన్నారు. మండలంలోని తగ్గువారిపల్లె ఇందిరమ్మ కాలనీలో శుక్రవారం హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువత, గర్భిణులు తప్పకుండా హెచ్ఐవీ పరీక్షలు చేసుకోవాలని సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ప్రభుత్వ పని దినాల్లో హెచ్ఐవీ పరీక్షలు, బాధితులకు కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. పరీక్ష ఫలితాలు గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు. ఎయిడ్స్‌కు మెరుగైన వైద్యంతో జీవిత కాలాన్ని పొడిగించుకునే మందులు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా అందుబాటులో ఉన్నాయన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్, టిబి వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై వివరించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ జయచంద్ర, కార్యకర్తలు జబీనా, లత పాల్గొన్నారు.

క్షయవ్యాధిని ముందుగా గుర్తిస్తేనే నివారణ సాధ్యం

తవణంపల్లె: క్షయవ్యాధి లక్షణాలపై అవగాహన ఉంటే ప్రాథమిక స్థాయిలోనే పూర్తిగా నివారించవచ్చని టి.బి సూపర్‌వైజర్ శివకుమార్ తెలిపారు. స్థానిక హైస్కూల్లో శుక్రవారం ఉపాధ్యాయులకు, విద్యార్థులకు క్షయవ్యాధి లక్షణాలు, నివారణపై అవగాహన కల్పించారు. శివకుమార్ మాట్లాడుతూ టి.బిని ప్రాథమిక స్థాయిలోనే గుర్తిస్తే పూర్తిగా నివారించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎవరికైనా రెండు వారాల పాటు జ్వరం, దగ్గు తగ్గకుండా ఉండడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే టీబీగా నిర్ధారించవచ్చని వివరించారు. ఇలాంటి లక్షణాలు ఉన్నవారికి తవణంపల్లె పీహెచ్‌సీలో ఉచితంగా గల్ల పరీక్షలు చేస్తారని తెలిపారు. టీబీ వ్యాధి ఉన్నవారు ఆరు నెలల పాటు మాత్రలు వాడితే నయం అవుతుందన్నారు. అదే విధంగా 60 ఏళ్ల పైబడిన వారు, సుగర్ వ్యాధిగ్రస్తులు, బరువు తక్కువగా ఉన్నవారు, పొగతాగేవారు సైతం బీసీజీ వ్యాక్సిన్ వేసుకోవడం మంచిదని సూచించారు. ప్రజలు అవగాహనతోనే టీబీని సంపూర్ణంగా నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం దేవరాజులు రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీహరి, ఎంఎల్‌హెచ్‌పీ భార్గవి, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



టీబీపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శివకుమార్

ఉపాధి హామీ పనులు వినియోగించుకోండి





తవణంపల్లె: మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్, చిత్తూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల

ఐరాల: వలసలు నివారించేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అమలు చేస్తున్న పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ సంధ్యారాణి తెలిపారు. మండలంలోని నాగంవాండ్లపల్లె పంచాయతీలో శుక్రవారం ఉపాధి గ్రామ సభలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రజల వలసలను తగ్గించేందుకు ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈపథకం కింద సొంత గ్రామంలోనే పనులు కల్పిస్తామన్నారు. ఉపాధి పనులు గుర్తించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శ్రీనివాసులు, ఉప సర్పంచ్ మునిరామయ్య పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో గ్రామాభివృద్ధి

తవణంపల్లె: ఉపాధి హామీ నిధులద్వారా గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తామని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. మండలంలోని 32 పంచాయతీల్లో ఉపాధి పనులు గుర్తింపు, అభివృద్ధి పనుల గుర్తించి ప్రణాళిక తయారు చేయడంపై సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. పట్నంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనకు సమగ్రమైన ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. పాఠశాలలో మొక్క నాటి నీరు పోశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, ఏపీఓ లలిత, ఎస్ఐ చిరంజీవి, ఉపాధి స్పెషలాఫీసర్లు, సర్పంచ్ పుష్పలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు పాల్గొన్నారు.

పనులను గుర్తించాలి

బంగారుపాళెం: గ్రామాల్లో కనీస వసతుల కల్పనకు అవసరమైన పనులకు ప్రాధాన్యం కల్పించి అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని ఎంపీడీఓ శివశంకర్ అన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో శుక్రవారం ఉపాధి హామీ గ్రామ సభలను నిర్వహించారు. గ్రామాలలో ప్రజలకు అవసరమైన పనులు, ఉపాధి హామీ పథకం ద్వారా చేస్తున్న పనులను గురించి గ్రామ సభల్లో చర్చించారు. గ్రామాల్లో అవసరమైన పనులకు ఆమోదం తెలిపారు. సీసీ రోడ్లు, మురుగు నీటి కాలువలు, తాగునీరు, వంటి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

గుడిపాల: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ అన్నారు. మండలంలోని ఏఎల్‌పురం, బసవాపల్లె పంచాయతీ గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో సీసీరోడ్లు, మరుగుదొడ్లు, వీధిలైట్లతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో ఉపేంద్ర, ఏఈలు జయచంద్రారెడ్డి, హిమంత్ పాల్గొన్నారు.

పేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్





గుడిపాల: వైద్యసేవలందిస్తున్న డాక్టర్ అనూష, తవణంపల్లె: మహిళను పరీక్షిస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్ పేదలకు వరమని స్థానిక వైద్యాధికారి వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కట్టకిందపల్లెలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో సుమారు 35 మంది రోగులకు వైద్య సేవలందించారు. గర్భిణులు, బాలింతలకు, వృద్ధులకు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో ప్రత్యేక పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామాల్లో దోమ కాటుకు గురికాకుండా దోమలను లార్వా దశలోనే అంతమొందించాలని సూచించారు. దోమలు కాటు వేయడం వల్లే డెంగీ, మలేరియా, ఫైలేరియా వంటి ప్రమాదకర వ్యాధులు వ్యాప్తిస్తాయని వివరించారు. జ్వరం సోకిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించి వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. గర్భిణులు ప్రసవం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. తవణంపల్లె పీహెచ్‌సీలో కాన్పులు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్యసేవలు అందిస్తున్నాం

గుడిపాల: ప్రతి గ్రామంలో ఇంటి వద్దకే వైద్యసేవలు సకాలంలో అందిస్తున్నామని డాక్టర్ అనూష తెలిపారు. మండలంలోని రాసనపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో గర్భిణులు, షుగర్ వ్యాధిగ్రస్తులు 66 మంది రోగులకు చికిత్సలు చేసి, మందులు పంపిణీ చేశారు. వైద్యసిబ్బంది శిరీషా, ఉమామహేశ్వరి, మల్లిక పాల్గొన్నారు.

ఆరంభం



ద్విచక్ర వాహనానికి పెట్రోలు పట్టుకుని బిల్లు చెల్లిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు ప్రారంభమైంది. కణ్ణన్ ప్రభుత్వ కళాశాల ఎదురుగా ఏర్పాటు చేసిన నూతన పెట్రోల్ బంకును ఎస్పీ మణికంఠ చందోలు శుక్రవారం ప్రారంభించారు. పోలీసుల సంక్షేమంలో భాగంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్)తో భాగస్వామ్యం కుదుర్చుకుని పెట్రోలు బంకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఎస్పీ తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వాహన ఇంధనాన్ని అందించడమే లక్ష్యమన్నారు. ఆయన తొలిసారిగా తన బండికి పెట్రోలు పట్టించుకుని బిల్లు చెల్లించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు, ఐవోసీఎల్ సిబ్బంది పాల్గొన్నారు.

సంబరం



టేకుమంద జెడ్పీ హైస్కూల్లో జాతీయ జెండాతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

బంగారుపాళెం: మండలంలోని టేకుమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అబ్దుల్ కలాం సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొదటి అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్‌సుభాన్ మాట్లాడుతూ, గత ఏడాది ఆగస్టు 23వ తేదీ మన దేశం పంపిన చంద్రయాన్–3 సురక్షితంగా చంద్రునిపై దిగిన విషయం తెలిసిందేనన్నారు. ఈ నేపథ్యంలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించినట్లు తెలిపారు. క్లబ్ ప్రతిపాదకులు షంషీర్‌ఖాన్, విజయకుమారి చంద్రయాన్–1, 2, 3 విశేషాలను విద్యార్థులకు తెలిపారు. అనంతరం చంద్రయాన్–3 నమూనాను, జాతీయ జెండాతోపాటు ప్రదర్శించారు.

ఆంగ్లంపై పట్టు ముఖ్యం

చిత్తూరు కలెక్టరేట్: డిగ్రీ విద్యార్థులకు ఆంగ్లంపై పట్టు ముఖ్యమని విజ్ఞానసుధ డిగ్రీ కళాశాల చైర్మన్ శ్రీధర్ అన్నారు. నగరంలోని విజ్ఞాన సుధ డిగ్రీ కళాశాలలో శుక్రవారం యూనెక్స్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆంగ్లంపై పట్టు పెంచుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. బెంగళూరుకు చెందిన యూనెక్స్ట్ ఉన్నత శిక్షణ సంస్థ విద్యార్థులకు శిక్షణ ఇచ్చిందన్నారు. విద్యార్థులు ఆంగ్లంపై పట్టు పెంచుకుంటే అనేక అవకాశాలు లభిస్తాయన్నారు. నైపుణ్యాలు పెంచుకోవడం వల్ల జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలిపారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ లీలా కుమారి, ప్రిన్సిపల్ సోమశేఖర్, చేంజ్ మేకర్ హబీబ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు